# 15849 స్థాయి కీలకం




## సెన్సెక్స్ విశ్లేషణ

**డిసెంబరు 9తో ముగిసిన వారానికి**

**సమీక్ష** : గత వారం మార్కెటులో అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ జరిగింది. యూరోపియన్ యూనియన్ నేతల శిఖరాగ్ర సమావేశం ఎటు దారితీస్తుందోనన్న దిగులు కూడా మదుపరుల సెంటిమెంటుకు గండి కొట్టింది. గత వారారంభంలో మార్కెట్లు పరిమిత శ్రేణిలో కదిలాయి. చిల్లర వర్తకంలో ఎఫ్‌డీఐల నిర్ణయాన్ని కేంద్రం వాయిదా వేయడం, దీనికి తోడు ద్రవ్య లోటు పెచ్చుపెరగవచ్చన్న ఆందోళనలు మరోమారు తలెత్తడం అమ్మకాలకు పురికొల్పాయి. ప్రపంచ మార్కెట్లలో బలహీనమైన ట్రేడింగ్‌తో పాటు, ఆహార ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో వారంలోనూ తగ్గుముఖం పట్టిందన్న సానుకూల వార్తల ప్రభావాన్ని సైతం యూరోపియన్ శిఖరాగ్ర సమావేశం అంశం తోసిరాజంది. బీఎస్ఈ సెన్సెక్స్ గత వారం 633 పాయింట్లు నష్టంతో 16214 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు** విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ లు) గత వారంలో రూ.1,198.90 కోట్ల మేరకు నికర కొనుగోళ్లు జరపగా, దేశీయ మ్యూచువల్ ఫండ్‌లు రూ.98.30 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశాయి.

**రంగాల వారీగా** రూపాయి మారకం విలువ క్షీణించడం, అమెరికా మెరుగైన ఆర్థిక గణాంకాలను నమోదు చేస్తుండటం ఐటీ కంపెనీలకు లాభాలు పంచాయి. ఆరోగ్య సంరక్షణ, వస్తు (ఎఫ్ఎమ్‌సీజీ) రంగాల వైపునకు మదుపరులు మొగ్గు చూపడంతో ఆ రంగాలు కూడా రాణించాయి. నష్టపోయిన రంగాలలో యంత్ర పరికరాలు, స్థిరాస్తి రంగాలు ఉన్నాయి. చమురు- సహజ వాయువుల రంగం కూడా అమ్మకాల ఒత్తిడికి గురైంది.

**లాభ నష్టాల షేర్ల నిష్పత్తి 2:3గా నమోదైంది. ట్రేడింగ్ బలహీనంగా జరిగిందనేందుకు ఇది సంకేతం.**

**భవిష్యత్ అంచనా** స్వల్ప కాలానికి సెన్సెక్స్‌కు 15500- 15700 మధ్య కీలక మద్దతు లభించే అవకాశం ఉంది; 16800- 17000 శ్రేణి వద్ద బలమైన నిరోధం ఎదురవ్వొచ్చు. మధ్య కాలానికి మార్కెట్ 14000- 14500 వరకు దిద్దుబాటుకు లోనయ్యే వీలు ఉందని సంకేతాలు వెలువరించింది. 15500 స్థాయికి ఎగువన నిలచినంత సేపూ అక్కడి నుంచి మరింత ఎగువకు వెళ్లే కన్నా ముందు ఒక శ్రేణిలో నిలదొక్కుకోగలగడాన్ని సూచిస్తుంది.

**ప్రభావిత అంశాలు** దేశీయ మార్కెట్లు సోమవారం లాభాలతో ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు. నేడు వెలువడే ఐఐపీ గణాంకాలు, 14న విడుదలయ్యే నవంబరు నెల ద్రవ్యోల్బణ సమాచారం, 15న ముందస్తు పన్ను వివరాలను మార్కెట్ తదుపరి దిశ కోసం నిశితంగా పరిశీలిస్తుంది. 16నాటి ఆర్‌బీఐ ద్రవ్య విధాన సమీక్ష కీలకం. సీఆర్‌ఆర్‌లో కోత విధించేటట్లయితే మార్కెట్ సెంటిమెంట్ తాత్కాలికంగా మెరుగుపడుతుందని ఆశిస్తున్నారు. ఈ సమావేశం నిరుత్సాహపరిచే పక్షంలో స్వల్ప కాలానికి మార్కెట్ లాభాలు పరిమిత శ్రేణిలోనే ఉండవచ్చు. ఇక రూపాయి, ద్రవ్య, వాణిజ్య లోటులు విస్తరిస్తూ, వృద్ధి రేటు మందగిస్తూ ఉండడం ఆందోళన కలిగించే అంశాలు.

**నిరోధ స్థాయిలు: 16431, 16718, 17004; మద్దతు స్థాయిలు: 16142, 15849, 15500.**
**15849 స్థాయి కంటే క్షీణించిన పక్షంలో స్వల్ప కాలానికి మరింత బలహీనతకు అవకాశముంది.**

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*